నమస్తే తెలంగాణ

# నిజామాబాద్





ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

## ప్రజావాణికి వినతుల వెల్లువ

కంఠేశ్వర్, జూన్ 10: పార్లమెంట్ ఎన్నికల కోడ్ అనంతరం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 135 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లా పాలనాధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ఆర్డీవో రాజేంద్రకుమార్, డీఆర్డీవో సాయాగౌడ్‌కు వినతిపత్రాలు సమర్పించారు. అనంతరం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులతో మాట్లాడారు. ఫిర్యాదులు, వినతులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పరిష్కరించాలని ఆదేశించారు.

### హాజరుశాతం మినహాయింపు ఇవ్వాలి

విద్యాశాఖ ఆధ్వర్యంలో వేసవికాలంలో ప్రతి సంవత్సరం నిర్వహించే టీటీసీ శిక్షణలో హాజరును 95శాతం నుంచి 75శాతానికి మినహాయింపు ఇవ్వాలని విద్యార్థులు ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. టీటీసీ శిక్షణకు ఆదిలాబాద్, నిర్మల్, కామారెడ్డి, సంగారెడ్డి తదితర దూర ప్రాంతాల నుంచి వస్తున్నందున సమయానికి రాలేకపోతున్నామని తెలిపారు. అధికారులు 95శాతం హాజరు ఉన్నవారికే డెమో క్లాసులకు అవకాశం ఇస్తున్నారని, వేసవికాలం దృష్ట్యా అనారోగ్యాలతో సరిగ్గా హాజరుకాలేదని, 75శాతం హాజరుశాతాన్ని పరిగణలోకి తీసుకోవాలని కోరారు. అంతకు ముందు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు.






- రూటు మార్చిన ప్రైవేటు యాజమాన్యాలు
- కొనసాగుతున్న బెల్ట్, యూనిఫామ్, పుస్తకాల విక్రయం
- అమ్మకాలు జరగాల్సిందేనంటున్న ప్రైవేటు పాఠశాలలు
- ప్రకటన జారీతో సరిపెట్టుకుంటారా? తనిఖీలు ఏమైనా చేస్తారా?

# ఓన్లీ క్యాష్..
# నో డిజిటల్ మనీ

### డీఈవో ఆదేశాలతో మారిన సీన్

ఖలీల్‌వాడి, జూన్ 10: నిజామాబాద్ జిల్లాలో కొన్ని ప్రైవేటు పాఠశాలలు బెల్టు, యూనిఫామ్‌లు, పుస్తకాల విక్రయాలు చేపడుతున్నాయంటూ నమస్తే తెలంగాణ దినపత్రికలో వచ్చిన కథనం ఆధారంగా డీఈవో దుర్గాప్రసాద్ ఓ ప్రకటన విడుదల చేశారు. పాఠశాల ఆవరణలో బెల్టు, యూనిఫామ్‌లు, పుస్తకాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా ఎలాంటి నోటీసులు జారీ చేయకుండానే ఆ పాఠశాల అనుమతులు రద్దు చేస్తామని ప్రకటనలో స్పష్టం చేశారు. కానీ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యాశాఖ అధికారి ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. అధికారులకు చిక్కకుండా ఉండేందుకు మరో రూట్‌ను ఎంచుకున్నారు. విద్యార్థుల సామగ్రి, యూనిఫామ్‌లు, పుస్తకాల కొనుగోలుకు సంబంధించి ఇప్పటి వరకు డిజిటల్ మనీ ప్లాట్‌ఫామ్‌లు అయిన ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం తదితర వాటిని ఎంచుకున్నాయి. కానీ డిజిటల్ మనీ ద్వారా విక్రయాలు కొనసాగిస్తే తనిఖీల్లో దొరికే ఆస్కారం ఉండడంతో మరోదారిలో వెళ్తున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వసూలు చేసే ప్రతీది కూడా నగదు(క్యాష్) రూపంలోనే స్వీకరిస్తున్నారు. బెల్టు, యూనిఫామ్స్, పుస్తకాలతోపాటు ఫీజుల చెల్లింపులు ఇక నుంచి నగదు రూపంలోనే చెల్లించాలని పలువురు తల్లిదండ్రుల ఫోన్లకు మెస్సేజ్‌లు పంపుతున్నారు. దీంతో తల్లిదండ్రులు ఏం చేయాలో తెలియక ఇబ్బందులుపడుతున్నారు. ఈ విషయం సైతం విద్యాశాఖ అధికారి తెలిసినా పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

### విద్యాశాఖ నుంచే ప్రైవేటుకు సలహాలు..

జిల్లా విద్యాశాఖ అధికారి ఇచ్చిన ప్రకటనతో ప్రైవేటు పాఠశాలలు కొత్తగా క్యాష్ ఫర్ సేల్ అనే విధంగా విద్యార్థుల తల్లిదండ్రులకు మెస్సేజ్‌లు పంపుతున్నాయి. డిజిటల్ మనీ ప్లాట్‌ఫామ్‌తో అయితే దొరికిపోతారనే భావనతో విద్యాశాఖలో పనిచేస్తున్న కొందరు అధికారులే ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు సలహా ఇస్తున్నట్లు సమాచారం. మరోవైపు అధికారుల అండదండలతోనే బెల్ట్, యూనిఫామ్‌లు, పుస్తకాలు అమ్ముతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

### తనిఖీలు శూన్యమేనా?

జిల్లా విద్యాశాఖ అధికారి ప్రకటన జారీ చేసిన కొద్ది సమయంలోనే పాఠశాల యాజమాన్యాలు తల్లిదండ్రులకు మెస్సేజ్‌లు పంపడంపై అనుమానం నెలకొన్నది. సదరు శాఖలో పనిచేస్తున్న వారే ముందస్తుగా సమాచారం ఇస్తున్నట్లు తెలిసింది. ప్రైవేటు పాఠశాలలు నిర్వహించే ఈ అక్రమ వ్యాపారానికి మామూళ్లు తీసుకునే కొంతమంది అధికారులు వత్తాసు పలుకుతున్నారని పలువురు తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 590 ప్రైవేటు పాఠశాలలుంటే 80శాతం పాఠశాలల్లో అమ్మకాలు జరుపుతున్నట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా ఇప్పటి వరకు ఒక్క ప్రైవేటు పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు చేపట్టిన దాఖలాలు లేకపోవడం గమనార్హం.

### దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం..



మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటున్నాం. త్వరలోనే తనిఖీలు నిర్వహిస్తాం. పాఠశాల ఆవరణలో బెల్టు, యూనిఫామ్‌లు, పుస్తకాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకోవడమే కాదు. అనుమతులు సైతం రద్దు చేస్తాం.

**- దుర్గాప్రసాద్, డీఈవో, నిజామాబాద్**




### సుప్రీం కోర్టు మార్గదర్శకాలు ఇవే..

సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, రవాణాశాఖ నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం ఒక బస్సు రోడ్డు ఎక్కాలంటే తప్పనిసరిగా 32 నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. అందులో ఫిట్‌నెస్, టైర్లు, సాంకేతిక సామర్థ్యం తదితర ఆంశాలపై సంతృప్తి చెందితేనే సర్టిఫికేట్ జారీ చేస్తారు.



- ప్రతి స్కూల్ బస్సు 40కిలోమీటర్ల స్పీడ్ లిమిట్ దాటకుండా చర్యలు తీసుకోవాలి.
- బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఎమర్జెన్సీ బాక్స్, ఫైర్ ఎగ్జిస్టింగ్ ఉండాలి.
- బస్సు తలుపులకు లాక్ సిస్టం, కిటికీలకు గ్రీల్స్ ఉండాలి.
- బస్సులకు పసుపు రంగు వేయడంతోపాటు ముందు, వెనకభాగంలో స్కూల్ బస్సు ఆన్ స్కూల్ డ్యూటీ రాయించాలి.
- విద్యార్థుల బ్యాగులు ఉంచేందుకు ప్రత్యేక స్థలం ఉండాలి.
- బస్సు డ్రైవర్‌కు హెవీ మోటార్ లైసెన్స్, బ్యాడ్జ్ లైసెన్స్‌తోపాటు భారీ వాహనాలు నడపడంలో ఐదేండ్ల అనుభవం ఉండాలి.
- విద్యార్థుల కోసం ప్రత్యేకంగా అటెండర్‌ను ఏర్పాటు చేయాలి.

### ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం..

ఫిట్‌నెస్ లేకుండా స్కూల్ బస్సులను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. తనిఖీల్లో పట్టుబడితే బస్సులను సీజ్ చేస్తాం. 15ఏండ్లు దాటిన స్కూల్‌బస్సులను నడుపొద్దు. స్కూల్ పిల్లల్ని తీసుకెళ్లే ఆటోలు, ఇతర వాహనాలపైనా నిఘా పెడుతాం. స్కూల్ పిల్లలను జాగ్రత్తగా ఇంటికి, పాఠశాలకు తీసుకెళ్లే వారినే యాజమాన్యాలు బస్సు డ్రైవర్‌గా నియమించుకోవాలి. డ్రైవర్, అటెండర్ ఎలాంటి మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలు సేవించకుండా చూసుకోవాల్సిన బాధ్యత స్కూల్ యాజమాన్యాలదే.

**- శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా రవాణాశాఖాధికారి, కామారెడ్డి**



# 44శాతమే.. ఫిట్

- జిల్లా వ్యాప్తంగా 232 బస్సులు
- ఫిట్‌నెస్ పరీక్షలకు వచ్చింది 101..
- ఫిట్‌నెస్ లేకుండా రోడ్డెక్కితే బస్సు సీజ్
- పాఠశాల బస్సుల కోసం ప్రత్యేక బృందాలు

**ప్రైవేటు పాఠశాలల బస్సులకు ఫిట్‌నెస్ కరువు**

కామారెడ్డి, జూన్ 10: రేపటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. విద్యార్థులు బ్యాగులు పట్టుకొని బయల్దేరడానికి సిద్ధంగా ఉన్నారు. ప్రైవేటు పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు బస్సుల్లో ప్రయాణించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రైవేటు పాఠశాలలకు చెందిన బస్సుల సామర్థ్యంపై అనుమానాలు వస్తున్నాయి. మోటారు వాహనాల చట్టం నిబంధనల మేరకు ప్రతి సంవత్సరం బస్సుల సామర్థ్య(ఫిట్‌నెస్) పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరం ఉంటుంది. కానీ జిల్లాలోని పలు ప్రైవేటు పాఠశాలలకు ఇవేమీ పట్టనట్లు కనిపిస్తున్నది. అందుకు సామర్థ్య పరీక్షలకు వచ్చిన బస్సుల సంఖ్యనే నిదర్శనంగా నిలుస్తున్నది. జిల్లా వ్యాప్తంగా 232 ప్రైవేటు స్కూల్ బస్సులు ఉన్నాయి. కానీ ఫిట్‌నెస్ పరీక్షలకు మాత్రం ఇప్పటి వరకు 101 బస్సులు మాత్రమే రావడం గమనార్హం. మిగతా బస్సులు ఎక్కడున్నాయి... అవన్నీ ఫిట్‌గానే ఉన్నాయా? ఫిట్‌నెస్ లేకుండా రోడ్డుపై నడిపితే ప్రమాదాలకు ఆస్కారం ఉండే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఫిట్‌నెస్ లేని బస్సులు రోడ్డుపై నడిస్తే పట్టుకొని సీజ్‌చేస్తామని జిల్లా రవాణాశాఖ అధికారి హెచ్చరిస్తున్నారు.



- క్షయ రోగులకు అందని పౌష్టికాహారం నిధులు
- ఏడు నెలలుగా రోగుల ఖాతాలో జమ కాని డబ్బులు
- జిల్లా వ్యాప్తంగా 1080 మంది రోగులు

# ఇదేమి శిక్షయ



జిల్లా దవాఖానలో వైద్య సేవలు పొందుతున్న టీబీ వ్యాధిగ్రస్తులు (ఫైల్ ఫొటో)

ఖలీల్‌వాడి, జూన్ 10: క్షయ చాపకింద నీరులా చేరి ప్రాణాలను హరిస్తున్నది. టీబీ రోగులకు ప్రధానంగా ఊపిరితిత్తులపై ప్రభావం పడి శ్వాసకోశ ఇబ్బందులు వస్తాయి. అదేవిధంగా వ్యాధినిరోధక శక్తి సైతం తగ్గుతుండడంతో ప్రభుత్వం టీబీ వ్యాధిగ్రస్తులకు మెరుగైన మందుగోళీలతోపాటు పౌష్టికాహారం తీసుకునేందుకు నెలకు రూ.500 చొప్పున ఇస్తున్నది. గత ఏడు నెలలుగా పౌష్టికాహారం నిధులు జమకాకపోవడంతో రోగులు కలత చెందుతున్నారు. ఓ స్వచ్ఛంద సంస్థ మాత్రం కొంతమంది టీబీ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్నది. మిగతా వారిని పట్టించుకునే నాథుడు కరువయ్యారు. దీంతో బిక్కుబిక్కుమంటూ రోగులు జీవనం కొనసాగిస్తున్నారు. మరి కొంత మందికి వైద్యాధికారులే వారి జేబులో నుంచి డబ్బులు ఇస్తున్నారు. మందులు వాడుతున్న తరణంలో పౌష్టికాహారం తప్పని సరిగా తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

### నగదు జమ ఇలా..

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 1080మంది క్షయ వ్యాధిగ్రస్తులు ఉన్నారు. వారికి ప్రతి నెల మల్టీ డ్రగ్ రెసిస్టెన్సీ కోసం రూ.500లు వారి అకౌంట్‌లో జమ కావాల్సి ఉన్నది. మూడు రకాలుగా అందించే ఈ పథకంలో మొదటగా 0 నుంచి 84 రోజుల వ్యవధిలో రూ.1500, 85 రోజుల నుంచి 168 రోజుల వ్యవధిలో రెండోసారి రూ.1500లు జమ చేసి, 169 రోజుల నుంచి మూడో విడుత రోగం ఎన్ని రోజులుంటే అన్ని రోజులు వారి వారి అకౌంట్‌లో ప్రతి నెలా రూ.500 చొప్పున నగదు జమ చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా పౌష్టికాహార నగదును అందిస్తూ వస్తున్నది. గత ఏడు నెలలుగా ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయకపోవడంతో రోగుల ఖాతాలో జమ కాలేదు. ప్రభుత్వం, అధికారులు స్పందించి రోగుల ఖాతాలో నగదు జమ చేయాలని కోరుతున్నారు.

### ప్రభుత్వం నుంచి నిధులు రాలేదు..

జిల్లాలో ఉన్న టీబీ వ్యాధిగ్రస్తులకు గత ఏడు నెలలుగా నిధులు రావడం లేదు. ప్రభుత్వం నుంచి ఇంకా నిధులు విడుదల కాకపోవడంతో ఆలస్యం జరిగింది. ప్రభుత్వం నుంచి విడుదల చేసిన వెంటనే వారి ఖాతాలో జమ అవుతాయి. ప్రస్తుతం వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సిబ్బంది చూసుకుంటున్నారు.

**- తుకారాం రాథోడ్, డీఎంహెచ్‌వో, నిజామాబాద్**

## పశువుల అక్రమ రవాణాను నిరోధించాలి

**కలెక్టర్ జితేశ్ వీ పాటిల్**

కామారెడ్డి, జూన్ 10: పశువుల అక్రమ రవాణా జరగకుండా పకడ్బందీ నిఘా ఏర్పాటు చేయాలని కలెక్టర్ జితేశ్ పాటిల్ అధికారులకు సూచించారు. 17న బక్రీద్ పండుగ సందర్భంగా జంతు సంక్షేమం, గోవధ నిషేధ చట్టం -1977 అమలుపై పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత పశువుల డాక్టర్ ధ్రువీకరణ లేకుండా ఆవులను తరలించడం నిషేధమన్నారు. పశు సంరక్షణ చట్టానికి లోబడి క్రయవిక్రయాలు జరిగేలా చూడాలన్నారు. బక్రీద్ సందర్భంగా ఎక్కడపడితే అక్కడ పశువులను వధించకుండా చూడాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద నిఘా పెట్టి ఆవులు, లేగ దూడలను రవాణా చేస్తున్నట్లు గుర్తిస్తే మున్సిపల్ సిబ్బంది అప్పగించి, అక్రమంగా తరలించే వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. రామేశ్వరపల్లిలో యానిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రం ప్రారంభమైందని తెలిపారు. కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స చేయడం ఒక్క మున్సిపల్ శాఖ పని మాత్రమే కాదని, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు, వ్యాపార సంస్థలు,పెంపుడు జంతువుల ప్రేమికులు శస్త్ర చికిత్సలు చేయడానికి ముందుకువచ్చి విరాళాలు అందించాలని సూచించారు. సమావేశంలో జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి సింహారావు, పశువైద్య సహాయ సంచాలకుడు రోహిత్ రెడ్డి, భాస్కరన్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్

## పెండింగ్ వేతనాలు ఇప్పించండి సారు..



జుక్కల్‌లో వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

బాన్సువాడ, జూన్ 10 : పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ జుక్కల్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ రంజిత్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు సురేశ్‌గొండ మాట్లాడుతూ.. జుక్కల్ మండలంలో గ్రామ పంచాయతీ కార్మికులకు ఎనిమిది నెలలుగా జీతాలు ఇవ్వడం లేదన్నారు. వేతనాలు లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న వేతనాలను అందించాలని కోరారు. జీవో 51 సవరించాలని, మల్టిపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జీవో 60 ప్రకారం పంచాయతీ ఉద్యోగులకు వేతనాల అమలు చేయాలని, ఐదు లక్షల ఇన్సూరెన్సుకు సంబంధించిన విధివిధానాలను ఖరారు చేయాలన్నారు. యూనియన్ మండల అధ్యక్షుడు గోవింద్, కార్మికులు ఈరయ్య, సాయిలు, గంగారాం, సాయిలు, మారుతీ తదితరులు పాల్గొన్నారు.